## బీసీల కోసం పోరాడే జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిలుద్దాం

### బడుగులను అవహేళన చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పి తీరాల్సిందేనంటున్న బీసీ సంఘాలు

బడుగుల గొంతుక కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపిద్దామని బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి. రాజకీయాలకతీతంగా బీసీలు ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా.. లోక్‌సభ ఎన్నికల్లో తిప్పికొడతామని స్పష్టం చేస్తున్నారు. బీసీల ఓట్లు లేనిదే ఏ పార్టీకీ మనుగడ ఉండదన్న విషయాన్ని ఈ ఎన్నికల్లో రుజువు చేసి చూపించాలని నేతలు పేర్కొంటున్నారు.



ముఖ్యంగా బడుగులను అవహేళన చేస్తున్న రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు. బీసీల శక్తిని, చైతన్యాన్ని ప్రదర్శించి ఆయా పార్టీల నేతల నోళ్లను మూయించాలని చెబుతున్నారు. బీసీల కోసం పోరాడే వ్యక్తులే కరువయ్యారని.. ఈ పరిస్థితుల్లో బీసీల హక్కుల కోసం పోరాడేందుకు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ)

# బడుగుల గొంతుక కాసాని

### బీసీ నాయకుడిని గెలిపించుకుందాం



చేవెళ్ల ఎంపీగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ ఆరు పార్లమెంట్ సీట్లు కేటాయించడం సంతోషకరం. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న కేసీఆర్.. బడుగు, బలహీన వర్గాల నేతకు చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని బీసీ సోదరులంతా సద్వినియోగం చేసుకొని కాసానిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం.

- మంగళి కరుణాకర్, కక్కులూర్, షాబాద్ మండలం

### చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చాటాలి



చేవెళ్ల గడ్డపై ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి. బీసీలంతా ఐకమత్యంగా ఉండి, కాసాని గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి. మన సత్తా ఏంటో ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.

- దయాకర్‌చారి, దామర్లపల్లి, షాబాద్ మండలం

### బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కాసాని



ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషిచేసి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. కాసాని లాంటి నాయకుడు పార్లమెంట్‌లోకి వెళ్లే నిరుపేదలు అభివృద్ధి చెందుతారు. బీసీలందరూ కలిసికట్టుగా కాసాని జ్ఞానేశ్వర్ వెంటే ఉండాలి. బీసీ నాయకుడిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం.

- ఎం.కిష్టయ్య అంగడిచిట్టంపల్లి, పూడూరు మండలం

### జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం



బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ సామాజిక వర్గానికి మొండిచేయి చూపగా.. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి టికెట్ ఇచ్చారు. కాసాని గతంలో ఉమ్మడి రంగారెడ్డిలో అనేక హోదాల్లో బీసీ వర్గాలకు చెందిన నాయకులను చైతన్యపర్చారు. బీసీ మేధావులు, విద్యావంతులు, యువకులు బీసీ అభ్యర్థిని గెలిపించి మన ఐక్యతను చాటాలి.

- జావిద్, మన్నెగూడ, పూడూరు మండలం

### బీసీల సత్తా ఏమిటో చూపిద్దాం



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మొదటి నుంచి ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అనేక మంది బీసీలకు బీఆర్‌ఎస్ చేయూతనందించింది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు టికెట్‌ను కేటాయించి బీసీల ఆత్మగౌరవాన్ని నిలిపింది. బీసీలంతా రాజకీయాలకతీతంగా కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- మల్లేశ్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, మణికొండ

### రాజకీయాలు పక్కనబెట్టి గెలిపించి చూపిస్తాం



బీసీలను తక్కువ చేసి మాట్లాడిన మోహన్‌రెడ్డిలాంటి వాళ్లు చాలామందే ఉన్నారు. కానీ బీసీల్లో ఐక్యత లోపించింది నిజమే.. ఇకనైనా రాజకీయాలను పక్కనబెట్టి చేవెళ్ల గడ్డపై బరిలో ఉన్న కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుదాం. ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటువేసి మన ఐక్యతను చాటిచెప్పాలి. అగ్రకులాల నేతలు మనందరినీ ఓటు రాజకీయాలకు బలిపశువుల్లా వాడుకుంటున్నారు.

- కొణతం లక్ష్మణ్‌గౌడ్, ఎండీ, కేఎల్ ఇన్‌ఫ్రా, మణికొండ

### జ్ఞానేశ్వర్‌తో బీసీల అభివృద్ధి



96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహా నేత జ్ఞానేశ్వర్. ఈ ఎన్నికల్లో బీసీలందరం ఏకమై పార్టీలకతీతంగా బీసీ బిడ్డను గెలిపించుకోవాలి. అందుకు కారు గుర్తుకు ఓటు వేసి బీసీల శక్తి, చైతన్యం నిరూపించుకోవాలి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ పార్టీలు మారే నేతలకు మనం ఓటు వేయొద్దు.

- రాంచందర్, తాండూరు

### జ్ఞానేశ్వర్ విజయం ఖాయం



చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కేసీఆర్ ప్రతిపాదించిన సందర్భంగా గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీల రెడ్డి నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మన బీసీ ముద్దు బిడ్డను భారీ మెజార్టీతో గెలిపించుకునే తరుణం వచ్చింది. బీసీల ఓట్లతో ఇరు పార్టీల నాయకులకు తగిన గుణపాఠం నేర్పుదాం. ఓటు దెబ్బతో బీసీల ఐక్యతను చాటి మన జ్ఞానేశ్వర్ అన్నను గెలిపించి పార్లమెంట్‌కు పంపుదాం.

- కాశయ్య, బీసీ యువ రైతు, మల్లేపల్లి, దోమ మండలం

### బీసీలు సిద్ధం కావాలి



రాజకీయాలకతీతంగా బీసీలు సిద్ధమై బీసీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి. బీసీలందరూ ఐక్యతగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం. ఇష్టానుసారంగా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలంటే ఏమిటో రుచి చూపించాలి. కాసానిని ఎంపీగా గెలిపించి పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడేట్లు చేయాలి.

- బుడ్డోల్ల నరేందర్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు, కందుకూరు

### కాసానిని గెలిపిస్తేనే న్యాయం జరుగుతుంది



బీసీల ఐక్యత లేకుండా ఇతరులు కుట్రలు చేస్తుండ్రు. అన్ని కులాల కంటే బీసీలు ఎక్కువ శాతం ఉన్నారు. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా అనేక సేవలు చేసిండ్రు. ఆయనను గెలిపిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. కాసానిని గెలిపించి బీసీలంతా ఒక్కటేనని నిరూపిద్దాం.

- కాకి దశరథ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకుడు, కందుకూరు

### కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం



నిస్వార్థంతో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి నిరంతరాయంగా పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వరన్న గెలుపు ఖాయం. స్వలాభం కోసం పార్టీలు మారి, టికెట్లు తెచ్చుకున్నంత మాత్రాన ప్రజలు ఆదరిస్తారనుకోవడం అవివేకం. తప్పుడు మాటలు, వాగ్దానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే నాయకులకు ప్రజలు బుద్ధిచెబుతారు.

- నరేందర్ భల్లా, చందానగర్

### బీసీ అభ్యర్థిని గెలిపిద్దాం



చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఎన్నో ఏండ్లుగా ప్రజా క్షేత్రంలో ఉంటూ, బీసీల అభ్యున్నతికి పోరాటం చేస్తున్న వ్యక్తిని పార్లమెంట్‌కు పంపిద్దాం. ప్రజా సేవ చేస్తామంటూ ముసుగేసుకుని తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునే మోసగాళ్ల డిపాజిట్లు గల్లంతయ్యేలా.. జ్ఞానేశ్వరన్నను గెలిపిద్దాం.

- ప్రవీణ్, శంకర్‌నగర్, చందానగర్

### బీసీల ఐక్యతను చాటుదాం



చేవెళ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి బీసీల బలం చూపిస్తాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను పట్టించుకోవడంలేదు. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్పా.. వారికి రాజ్యాధికారం ఇవ్వడంలేదు. 96 బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల కోసం పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కింది.

- నర్సింహులు, బొపునారం, బంట్వారం

### బీసీ నాయకున్ని గెలిపించుకుందాం



అన్ని ఎన్నికల్లో ఇతర వర్గాల వారికి ఓట్లు వేసిన బీసీలు ఈసారి బీసీ అభ్యర్థికి ఓటు వేసుకునే చక్కటి అవకాశం వచ్చింది. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలి. పార్లమెంటులో తెలంగాణ గొంతుకను వినిపించేలా చేయాలి.

- నర్సింహులు, వికారాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యయ పరిశీలకుడు ఐఆర్‌ఎస్ అధికారి రాజీవ్ చావ్రా, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు

## ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు

# చర్యలు తీసుకోవాలి

### జిల్లా వ్యయ పరిశీలకుడు ఐఆర్‌ఎస్ అధికారి రాజీవ్ చావ్రా

వికారాబాద్, ఏప్రిల్ 20 : పార్లమెంటు ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాకు నియమించబడిన వ్యయ పరిశీలకుడు ఐఆర్‌ఎస్ అధికారి రాజీవ్ చావ్రా అన్నారు. శనివారం రాజీవ్ చావ్రా కలెక్టర్ కార్యాలయానికి రావడంతో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎన్‌జీఆర్‌ఎస్, ఎలక్షన్ కంట్రోల్ రూమ్, సీ విజిల్, ఎంసీఎంసీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

### ఖర్చులను జాగ్రత్తగా నమోదు చేయాలి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చేసే ఖర్చులను ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరిగే ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు జాబితా, ఎఫ్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్‌ఎస్‌టీ టీమ్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వ్యయ పరిశీలకుడికి వివరించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చేసే ఖర్చులను ఏ విధంగా లెక్కిస్తున్నారు అనే వివరాలను వ్యయ పరిశీలకుడు అడిగి తెలుసుకున్నారు. అన్ని టీంలు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని, అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్‌ఎస్‌సీ అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలన్నారు. ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరపున ఖర్చుచేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద చూపించాలన్నారు.

అనంతరం సీ విజిల్ యాప్, టోల్ ఫ్రీ నం.1950 కాల్ సెంటర్, గ్రీవెన్స్ కమిటీ సెంటర్, మీడియా సెంటర్‌లను రాజీవ్ చావ్రా తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్‌ఎస్‌టీ బృందాలను కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన స్క్రీన్లను పర్యవేక్షించారు. ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో చేసిన ప్రకటనలకు ఎన్నికల సంఘం రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా రోజువారీ దినపత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలని, సోషల్ మీడియాపై పటిష్ట నిఘా ఉండాలని రాజీవ్ చావ్రా పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీవోలు వసుచంద్ర, శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీఏ శ్రీనివాస్, అన్ని టీంల నోడల్ అధికారులు, ఎంసీఎంసీ టీం, అకౌంటింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎన్నికల అధికారులు, సిబ్బంది



కడ్తాల్ : మృతిచెందిన ఆవు



ధారూరు : పులిచింతల మడుగుతండాలో ఈదురు గాలులకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్



యాచారం : నజ్దిక్‌సింగారంలో పిడుగుపాటుకు మృత్యువాతపడిన రెండు ఆవులు



యాచారం : మేడిపల్లి గ్రామంలో ఇంటిముందు విరిగిపడ్డ చెట్టు

# ఈదురుగాలులతో అపార నష్టం

### నేలకొరిగిన పంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, విరిగిపడ్డ చెట్లు, పశువుల షెడ్లు నేలమట్టం

### పిడుగుపాటుకు పాడి ఆవులు మృత్యువాత



బొంరాస్‌పేట : మదన్‌పల్లిలో గాలికి లేచిపోయిన ఇంటిపైకప్పు రేకులు

యాచారం, ఏప్రిల్ 20 : మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతులకు అపార నష్టం చేకూరింది. నజ్దిక్‌సింగారం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి అనే రైతుకు చెందిన రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డాయి. దీంతో తనకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరాడు. కిషన్‌పల్లి గ్రామంలో ఈదురుగాలులకు మూడు బర్ల షెడ్లు నేలమట్టమయ్యాయి. మండలంలోని మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లితోపాటు పలు గ్రామాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మేడిపల్లి, నందివనపర్తి, చింతపట్ల, తక్కళ్లపల్లి గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. చెట్లు విరిగిపడ్డాయి. రోడ్లతోపాటు ఇండ్ల మధ్య వర్షం నీరు నిలువడంతో చిన్నపాటి కుంటలను తలపించాయి.

#### ధారూరు మండలంలో..

ధారూరు : మండలంలోని నాగారం, గురుదోట్ల, అంపల్లి, పులిచింతల మడుగుతండా, జీడిగడ్డ తండాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పులిచింతల మడుగుతండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకు ఒరిగింది. విద్యుత్ స్తంభం కింద పడి తీగలు రోడ్డుపై పడ్డాయి. చెట్లు విరిగిపడ్డాయి. ఈదురుగాలులతోపాటు వడగళ్ల వర్షం కురిసింది.

#### బొంరాస్‌పేట మండలంలో..

బొంరాస్‌పేట : మండలంలోని మదన్‌పల్లి, మదన్‌పల్లితండాల్లో శనివారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మదన్‌పల్లితండా నుంచి నాగారం మధ్య రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో బొంరాస్‌పేట–వికారాబాద్ మధ్య వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. కొద్దిసేపటి తరువాత జేసీబీ సహాయంతో చెట్లను తొలగించారు. మదన్‌పల్లి గ్రామంలో కొక్కు క్రిష్టయ్య ఇంటిపై కప్పుకున్న రేకులు లేచిపోయాయి. వర్షానికి ఇంట్లోని సామగ్రి అంతా తడిసిపోయిందని బాధితుడు వాపోయాడు. గ్రామంలో కూడా ఇండ్ల మధ్య చెట్లు విరిగిపడ్డాయి. ఈదురు గాలుల తోపాటు వడగళ్ల వర్షం కురిసింది.

#### కడ్తాల్ మండలంలో..

కడ్తాల్ : మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వాన కురిసింది. రావిచేడ్ గ్రామంలో కల్లూరి రవీందర్‌యాదవ్‌కు చెందిన వ్యవసాయ పొలంలో పిడుగు పడటంతో ఆవు మృతి చెందింది. దాని విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.



యాచారం : కిషన్‌పల్లిలో నేలమట్టమైన పశువుల షెడ్డు



ధారూరు : పులిచింతల మడుగుతండాలో నేలకొరిగిన స్తంభం, తీగలు

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


**వంగేటి లక్ష్మారెడ్డి**



యాచారం : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వంగేటి లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి పంటలు, మామిడి, కూరగాయల తోటలు, పశువుల షెడ్లు నష్టపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు జరిగిన నష్టాన్ని వ్యవసాయాధికారులు, హార్టికల్చర్ అధికారులు వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి సకాలంలో నివేదిక అందించాలని సూచించారు. బాధిత రైతులకు సకాలంలో నష్టపరిహారం అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంథన్‌గౌరెల్లిలో వడగళ్లతో నష్టపోయిన పంటలకు, ఇండ్లకు తక్షణమే పరిహారం అందించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు. అకాల వర్షాల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, కొనుగోళ్లు చేపట్టాలని, రైతులకు మద్దతు ధరను ప్రకటించాలని ఆయన కోరారు.

## అంగన్‌వాడీ పిల్లల అభివృద్ధికి వినూత్న పద్ధతులు

### ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి



ఎన్కేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలతో గ్రాడ్యుయేషన్ డే

మొయినాబాద్, ఏప్రిల్ 20 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్ విద్యార్థుల అభివృద్ధి కోసం వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నపిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. త్రీ, ఫోర్ ప్లస్ పిల్లలకు పిల్లల అభివృద్ధి పుస్తకం, ప్రీ స్కూల్ సర్టిఫికెట్‌లను తల్లుల సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే గ్రాడ్యుయేషన్ అనే కార్యక్రమాన్ని అలవాటు చేస్తే తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులను చదివించే అవకాశం ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నదని పేర్కొన్నారు. పిల్లలు బడికి అలవాటుపడాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రీ స్కూళ్లకు పంపించాలని తల్లిదండ్రులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, మంగమ్మ ఉన్నారు.

## ఉచిత వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటుకు

# దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఏప్రిల్ 20 : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు 14 ఏండ్లలోపు బాలబాలికలకు వేసవి శిక్షణా శిబిరాలను వికారాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ అధికారి హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలను నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు, ఇతర సీనియర్ శిక్షకులు వారి ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. శిక్షణ ఇచ్చే క్రీడల వివరాలు, ప్రదేశం, గ్రామం, వివరాలు ఈ నెల 25 లోపు జిల్లా యువజన, క్రీడల కార్యాలయం, కలెక్టరేట్‌లోని రూం నం. ఎస్ 15 రెండో అంతస్తులో స్వయంగా వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనం రూ.4వేలు, క్రీడా సామగ్రి అందించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9676638201ని సంప్రదించాలని ఆయన సూచించారు.